

సోమశిలలో 7.44 టీఎంసీలు
సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 7.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,659
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,859
సవర (8 గ్రాములు)	రూ.54,872



చీకటి కార్యకలాపాలు సాగిస్తే చర్యలు
క్రాస్ మసాజ్‌లు, చీకటి కార్యకలాపాలను సాగిస్తే చర్యలు తప్పవని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. నగరంలోని స్పా సెంటర్లలో తనిఖీలు చేపట్టారు. 8లో

శుక్రవారం, 31, మే, 2024

న్యూస్‌రీల్

3.14 లక్షల మందికి పింఛన్లు
• బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ

నెల్లూరు(పొగతోట): జిల్లాలో 3,14,422 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుకను అందజేయనున్నారు. 2,28,471 మంది బ్యాంక్ ఖాతాల్లో నగదును జూన్ ఒకటి నుంచి ఐదో తేదీలోపు జమ చేయనున్నారు. దివ్యాంగులు, నడవలేని వారు, ఆరోగ్యం సక్రమంగా లేని 85,951 మంది లబ్ధిదారులకు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటి వద్దే నగదును అందజేయనున్నారు. నగదును డ్రా చేసేందుకు బ్యాంకుల వద్దకు వచ్చే లబ్ధిదారులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు
నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ప్రథమ సంవత్సర పరీక్షల్లో జనరల్‌కు సంబంధించి 8421 మందికి గానూ 7861 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 250 మందికి గానూ 66 మంది గైర్హాజరయ్యారు.

• ద్వితీయ సంవత్సర పరీక్షల్లో జనరల్‌కు సంబంధించి 1264 మందికి గానూ 1174 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 88 మందికి గానూ 14 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌ఐఓ, డీవీఈఓ స్క్వాడ్ అధికారులు 37 కేంద్రాల్లో తనిఖీలను నిర్వహించారు.

స్కూల్ బస్సులకు ఎఫ్‌సీ తప్పనిసరి
నెల్లూరు (టౌన్): విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పక ఉండాలని ఇన్‌చార్జి డీటీసీ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో తరగతుల పునఃప్రారంభ సమయానికి అన్ని బస్సులకు ఫిట్‌నెస్ ఉండాలని చెప్పారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. జిల్లాలో 392 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీ చేశామని, కండిషన్ సక్రమంగా లేని 71 బస్సులను తిప్పి పంపామని చెప్పారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్లో మార్పులు
నెల్లూరు (టౌన్): కౌంటింగ్ నేపథ్యంలో పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్లో మార్పులు చేశారని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను వచ్చే నెల ఆరు వరకు.. ఆప్షన్లను పదో తేదీ వరకు.. ఆప్షన్ల మార్పు 11 వరకు.. సీట్ల కేటాయింపు 13న.. జాయినింగ్ రిపోర్టులను 14 నుంచి 19వ తేదీ వరకు అందజేయనున్నారని వివరించారు. తరగతులు 14 నుంచి ప్రారంభంకానున్నాయని వెల్లడించారు.

సీపీఎస్ ఉద్యోగులకు యథావిధిగానే జీతాలు
నెల్లూరు(అర్బన్): సీపీఎస్ పరిధిలో జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు జీతాలను ఈ నెలా యథావిధిగా చెల్లించనున్నామని జిల్లా ఖజానాధికారి గంగాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ కింద ఉద్యోగంలో కొత్తగా చేరిన వారికి ప్రాన్ నంబర్ లేకపోయినా మొదటి నెల జీతాలను చెల్లించనున్నామని చెప్పారు. తర్వాతి నెల మాత్రం డీడీఓ వారు ప్రాన్ నంబర్ పొంది అప్‌డేట్ చేయాల్సి ఉంటుందన్నారు. సీపీఎస్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్న వెంటనే నంబర్‌ను పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. నంబర్ లేదనే నెపంతో బిల్లులను ఖజానా ద్వారా వెనక్కి పంపలేదని వివరించారు. జిల్లాలో ఎనిమిది మందికి మాత్రమే ప్రాన్ నంబర్ లేదని, డీడీఓల ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించామని చెప్పారు.

1.65 కిలోల బంగారం స్వాధీనం
వెంకటాచలం: వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద 1.658 కిలోల బంగారాన్ని పోలీసులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలను సీఐ అంకమరావు తన సిబ్బందితో కలిసి చేపట్టారు. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన వంశీ, రాజా తమ కారులో చెన్నై నుంచి 1.658 కిలోల బంగారాన్ని తరలిస్తుండగా, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈసెట్ ఫలితాల విడుదల
నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసుకొని ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ ఈసెట్ ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 961 మంది దరఖాస్తు చేసుకోగా, 927 మంది హాజరయ్యారు. వీరిలో 832 మంది అర్హత సాధించారు. ఉలవపాడుకు చెందిన షణ్ముఖ శర్మ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 145 మార్కులను సాధించి ఏడో ర్యాంక్‌ను దక్కించుకున్నారు.

చెప్పిందే కార్పొరేటు

నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డులో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి తన కుమారుడ్ని నర్సరీలో చేర్పించేందుకు జిల్లా పోలీస్ కార్యాలయ సమీపంలోని ఓ పాఠశాలకెళ్లి ఫీజుల వివరాలను ఆరా తీశారు. దీంతో సదరు యాజమాన్య ప్రతినిధులు ఓ స్లిప్పుపై ఫీజుల వివరాలను రాసిచ్చారు. అడ్మిషన్ ఫీజు రూ.15 వేలు, ట్యూషన్ ఫీజు రూ.44 వేలు, పుస్తకాల ఫీజు రూ.ఆరు వేలు, యాక్టివిటీ ఫీజు రూ.రెండు వేలు.. ఇలా మొత్తం రూ.67 వేలను చెల్లించాలని చెప్పారు. వ్యాన్ ఫీజు మరో రూ.15 వేలు అదనమని తెలిపారు. ఈ వివరాలను చూసి అవాక్కవ్వడం తల్లిదండ్రుల వంతైంది. నర్సరీకి ఇంత ఫీజా.. పుస్తకాల కోసం రూ.ఆరు వేలు ఏమిటంటూ అక్కడి సిబ్బందిని ప్రశ్నించారు. తమ పాఠశాలలో ఫీజు ఇలానే ఉంటుందని చెప్పడంతో చేసేది లేక వెనుదిరిగారు.

నగరంలోని వేదాయపాళెంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి తన కుమార్తెను నర్సరీలో చేర్పించేందుకు బీవీ నగర్‌లోని ఓ పాఠశాలను సందర్శించారు. ఫీజు వివరాలను ఆరాతీశారు. పాఠశాల ఫీజు రూ.40 వేలు, పుస్తకాలకు రూ.ఆరు వేలు, యూనిఫారానికి రూ.రెండు వేలు.. ఇలా మొత్తం రూ.48 వేలు చెల్లించాలని చెప్పారు. వీటికి అదనంగా వ్యాన్ ఫీజు రూ.28 వేలు ఉంటుందని తెలిపారు. నర్సరీకి ఇంత మొత్తంలో ఫీజు ఏమిటో అర్థం కావడంలేదంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. నెల్లూరులో ఈ రెండు పాఠశాలలే కాదు.. పేరున్న మరికొన్ని స్కూళ్లలో సైతం నర్సరీకి ఇంకా ఎక్కువ మొత్తంలో ఫీజులను వసూలు చేస్తుండటం గమనార్హం.

కార్పొరేట్ పాఠశాలల ధనదాహానికి అడ్డూ అదుపులేకుండా పోతోంది. తాము చెప్పిందే రేటు అనే తరహాలో ముందుకెళ్తూ అడ్డగోలుగా ఫీజులను ఖరారు చేస్తున్నారు. స్కూల్ బట్టి ఒక్కో తరగతికి రూ.20 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. నర్సరీలో ప్రవేశానికే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. మరోవైపు కొన్ని పాఠశాలల్లో సీట్లు ఇప్పటికే పూర్తయ్యాయంటూ కొత్త నాటకానికి తెరలేపారు. ఇంత భారీ మొత్తంలో ఫీజులను వసూలు చేస్తున్నా, ఆయా స్కూళ్లలో వసతులున్నాయా అంటే అదీ అంతంతమాత్రమే.

అడ్డగోలుగా ఫీజుల వసూలు
- పాఠశాల బట్టి రూ.20 వేల నుంచి రూ.1.5 లక్షలు
- నర్సరీకే రూ.50 వేల నుంచి రూ.లక్ష
- పుస్తకాలు, యాక్టివిటీ పేరుతో అదనం
- బెంబేలెత్తుతున్న తల్లిదండ్రులు

నెల్లూరు (టౌన్): తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించాలనే తల్లిదండ్రుల తపనను కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు క్యాష్ చేసుకుంటున్నాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలను జూన్ 12న పునఃప్రారంభించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ తరుణంలో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు పాఠశాలల బాటపట్టారు. ఇదే అదునుగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు రకరకాల ఎత్తుగడలు వేస్తున్న పరిస్థితి నెలకొంది.

కృత్రిమ కొరత

జిల్లాలో 500కుపైగా కార్పొరేట్, ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలు.. 300కుపైగా ఉన్నత పాఠశాలలున్నాయి. ఇక్కడ చేరేందుకు సాధారణంగా ఎక్కువ మంది ఉత్సాహం చూపుతుంటారు. దీంతో ఫీజును మరింత పెంచుకునేందుకు పేరున్న పాఠశాలల యాజమాన్యాలు సీట్ల కొరతను సృష్టించి డిమాండ్‌ను అమాంతం పెంచుతున్నాయి. మా పాఠశాలల్లో సీట్లు లేవని చెప్పి వెనక్కి పంపుతున్నారంటే వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో అప్పు చేసైనా తమ పిల్లలను ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులు చేర్పిస్తున్నారు.



తూతూమంత్రంగా తనిఖీలు

జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై జిల్లా విద్యాశాఖ అధికారుల తనిఖీలు నామమాత్రంగానే ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి పాఠశాలల నిర్వహణను తనిఖీ చేసేందుకు గానూ ప్రతి మండలంలో ఇద్దరు ఎంఈఓలను ప్రభుత్వం నియమించింది. పనిభారం పడకుండా వీరికి వేర్వేరుగా బాధ్యతలను అప్పజెప్పారు. వీరితో పాటు నెల్లూరు, కావలి, కందుకూరులో డిప్యూటీ డీఈఓలు ఉన్నారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వహణను వీరు పర్యవేక్షించాల్సి ఉన్నా, కార్యాలయాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు తుంగలో..

పాఠశాలల్లో యూనిఫారం, పుస్తకాలను విక్రయించకూడదనే నిబంధన ఉన్నా, ఆయా యాజమాన్యాలు పెడచెవిన పెడుతున్నాయి. ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించాలనే ఆదేశాలనూ బేఖాతర్ చేస్తున్నాయి. పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేకపోయినా.. కింది స్థాయి నుంచి జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారి వరకు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వామ్మో.. ఇంతా..!
పాఠశాల బట్టి నర్సరీ నుంచి పదో తరగతి వరకు రూ.20 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఫీజును వసూలు చేస్తున్నారు. పేరున్న పాఠశాలల్లో నర్సరీకే రూ.50 వేల నుంచి రూ.లక్ష చొప్పున చెప్తున్నారు. నర్సరీలో పిల్లలకు ప్రత్యేకంగా ఏమి చెప్తారో ఎవరికీ అంతుచిక్కడంలేదు. ఈ ఫీజుల వివరాలను వింటేనే తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు.

సౌకర్యాలా.. సారీ

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో వసతులు, సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. విశాలమైన గదులు, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, ఆడుకునేందుకు మైదానాలు.. ఇలా ఏవీ ఉండవు. ఏ పాఠశాలలోనైనా క్వాలిఫైడ్ టీచర్లు నామమాత్రమే. మరికొన్ని పాఠశాలల యాజమాన్యాలు రెన్యువల్ సైతం చేయరు. ఇంకొన్ని చోట్ల ప్రభుత్వ అనుమతి లేకుండానే తరగతులను నిర్వహిస్తుండటం గమనార్హం. ఇలా ప్రభుత్వ నిబంధనల మేరకు ఏ పాఠశాలనూ నిర్వహించడం లేదు. ప్రధానంగా బడ్జెట్ పాఠశాలలను నారాయణ, శ్రీచైతన్య తదితర యాజమాన్యాలు కొనుగోలు చేసి తమ పేరును వాటికి తగిలించుకుంటున్నాయి. చివర్లో సర్టిఫికెట్‌ను మాత్రం పాత స్కూల్ పేరుపైనే ఇస్తున్నారు.

ఇప్పటికైనా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ, అధిక ఫీజుల నియంత్రణపై అధికారులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

FEE STRUCTURE -2024 - 25	
PLAY	
Admission Fee	15,000
Tution Fee	44,000
Books fee	6,000
Activity fee	2,000
Total	67,000

Note: : Tution Fee can be paid in two terms.Books fee& 1st term fee should be paid at the time of promotion.

నర్సరీకి ఓ పాఠశాల యాజమాన్యం వసూలు చేస్తున్న ఫీజు వివరాలు

జీఓ నంబర్ ఒకటిని పాటించాలి
జీఓ నంబర్ ఒకటిని పాఠశాలల యాజమాన్యాలు తప్పక పాటించాలి. విద్యా సంవత్సర ప్రారంభంలో ఫీజల వివరాలను నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించాలి. ఫీజులపై పేరెంట్స్ ఆమోదం ఉండాలి. నోటీస్ బోర్డుల్లో వివరాలను ఉంచని పాఠశాలలపై చర్యలు చేపడతాం. పాఠశాలలను ఎంఈఓల ఆధ్వర్యంలో జూన్ 12 నుంచి తనిఖీ చేస్తాం. స్టేషనరీ, పుస్తకాలు, యూనిఫారాన్ని విక్రయించకూడదు. ఇలాంటివి ఎక్కడైనా ఉంటే సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేయాలి. పాఠశాలలకు నోటీసులను జారీ చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు చేపడతాం.

– రామారావు, డీఈఓ

ప్రసన్నాంజనేయుడికి విశేషార్చనలు

హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో కొలువైన ప్రసన్నాంజనేయస్వామికి అభిషేకాలు, అర్చనలు, హోమాలను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా నాగారెడ్డి సురేంద్రరెడ్డి, సందీప్‌రెడ్డి వ్యవహరించారు.

– నెల్లూరు(బృందావనం)



ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న గాయత్రీదేవి

కలిగిరి: మండలంలోని చిన్నఅన్నలూరు పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా ఏపీడీ గాయత్రీదేవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రోజుకు రూ.300 కూలి గిట్టుబాటయ్యేలా కూలీలు నిర్దీత కొలతల్లో పనులు చేయాలని సూచించారు. కనీసం నాలుగు గంటలు పనులు చేసేలా చూడాలన్నారు. పనుల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని వివరించారు. పనుల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు. టీఏ మధు తదితరులు పాల్గొన్నారు.

ముందు 46.. ఆపై 96 మార్కులు
• పది రీ వెరిఫికేషన్లో వెలుగుచూసిన వైనం

నెల్లూరు (టౌన్): పదో తరగతి మూల్యాంకనంలో తప్పులు దొర్లిన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, ముందు వచ్చిన మార్కుల కంటే ఇప్పుడు పెరుగుతున్నాయి. తాజాగా నెల్లూరులో ఈ విషయం బయటకొచ్చింది. నగరంలోని నేతాజీ పైలట్ స్కూల్ విద్యార్థి మనస్వితాదరికి హిందీ సబ్జెక్టులో 46 మార్కులొచ్చాయి. పాఠశాల యాజమాన్య సూచన మేరకు రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. తాజాగా రీ వెరిఫికేషన్లో 96 మార్కులొచ్చాయని ప్రకటించారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.322



కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు గరిష్ట ధర రూ.322 గురువారం లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 628 బేళ్లను తీసుకురాగా, 517 బేళ్లను కొనుగోలు చేశారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడారు. కనిష్ట ధర రూ.205.. సరాసరి కిలో పొగాకుకు రూ.282.04 లభించిందని చెప్పారు. వేలంలో 14 కంపెనీలు పాల్గొన్నాయన్నారు.

రెడ్‌జోన్‌గా కౌంటింగ్ కేంద్రం

- డ్రోన్లు ఎగరేయడం నిషేధం
- ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



నెల్లూరు(క్రైమ్): కౌంటింగ్ కేంద్రమైన ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలతో పాటు పరిసర ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటిస్తూ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భద్రత కారణాల దృష్ట్యా రెడ్‌జోన్‌లో డ్రోన్లను ఎగరేయడం నిషేధమని చెప్పారు. నిబంధనలను అతిక్రమిస్తే డ్రోన్లను సీజ్ చేయడంతో పాటు ఎగరేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్‌కు ముందస్తు భద్రత ఏర్పాట్లు చేశామని.. 144 సెక్షన్, ఏపీ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని చెప్పారు. ఎగ్జిట్ పోల్స్ శనివారం వెల్లడి కానున్న నేపథ్యంలో అందరూ సంయమనంతో ఉండాలని కోరారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు.. తప్పుడు వార్తలు.. అవాస్తవాలను వాట్సాప్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేస్తే గ్రూప్ అడ్మిన్లతో పాటు సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని చెప్పారు. ఫలితాలు వెలువడిన అనంతరం ఊరేగింపులు, ర్యాలీలు నిషేధమని, బాణసంచాను పేల్చరాదని స్పష్టం చేశారు.

నర్రవాడలో టెండర్ల నిర్వహణ



దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థాన సన్నిధిలో బహిరంగ వేలం, టెండర్లను గురువారం నిర్వహించారు. వెంగమాంబ బ్రహ్మోత్సవాలు జూన్ 23 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వివిధ ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై టెండర్లను దేవదాయ శాఖ అధికారులు జరిపారు. టెండర్లను పలువురు దక్కించుకున్నారు. తాత్కాలిక దుకాణాలకు బాడుగ వసూలు.. దేవస్థానంలో రంగులేయడం.. ఫొటోలు, వీడియోలు తీయడం.. ఆల్బమ్స్ తయారు చేయడం.. తదితరాలకు సంబంధించిన వేలాన్ని వాయిదా వేశారు. ఈఓ ఉషశ్రీ, నెల్లూరు నవాబుపేటలోని మల్లేశ్వరస్వామి దేవస్థాన ఈఓ కవిత, ఆలయ వ్యవస్థాపక ప్రధాన ధర్మకర్త తుమ్మల వెంకటసురేష్‌బాబు, సర్పంచ్ నాగయ్య, ఆలయ ఉప ప్రధానార్చకుడు బెల్లంకొండ పెద భద్రయ్య పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లను పూర్తి చేయండి



కౌంటింగ్ కేంద్రంలో సంతకం చేస్తున్న కలెక్టర్



మాట్లాడుతున్న హరినారాయణన్

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): ఓట్ల లెక్కింపునకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆదివారం లోపు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కౌంటింగ్ ఏర్పాట్లపై గురువారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో బ్యారికేడ్ల ఏర్పాటు.. పటిష్ట పోలీస్ బందోబస్తు.. నిరంతర విద్యుత్ సరఫరా.. వాహనాల పార్కింగ్.. తాగునీరు.. భోజన వసతి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కమిటీ చైర్మన్, నెల్లూరు సిటీ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, కోవూరు, నెల్లూరు రూరల్ ఆర్వోలు సేతు మాధవన్, మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, నుడా వీసీ బాపిరెడ్డి, డీఆర్వో లవన్న, అడిషనల్ కమిషనర్ శర్మద, ఎస్‌ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన

నెల్లూరు(అర్బన్): కౌంటింగ్‌కు సంబంధించి ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌లను పర్యవేక్షిస్తున్న కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా భద్రత కల్పించాలని ఆదేశించారు. నెల్లూరు సిటీ, కోవూరు రిటర్నింగ్ అధికారులు వికాస్ మర్మత్, సేతు మాధవన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు మానేయ్.. ఆరోగ్యంగా ఉండు



చుట్ట, బీడీ, సిగరెట్‌తో ఎన్నో అనర్థాలు
- గుండెపోటు, పక్షవాతం, ఊపిరితిత్తుల వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు
- పొగ పీల్చేవారికీ అనారోగ్య సమస్యలు

థియేటర్‌లో సినిమా ప్రారంభానికి ముందు ఒక ప్రకటన వస్తుంది. 'ఈ నగరానికి ఏమైంది? ఓ వైపు మసి.. మరో వైపు పొగ.. ఎవరూ మాట్లాడరేం? కాలే బీడీ, సిగరెట్ ఎక్కడ కనిపించినా ఉపేక్షించకండి. ఈ నిర్లక్ష్యానికి తప్పదు భారీ మూల్యం.' చాలామంది పొగరాయుళ్లు దీనిని చూసే ఉంటారు. సినిమా అయ్యాక బయటకు వచ్చి సిగరెట్ వెలిగించేస్తారు. పొగాకు ఆరోగ్యానికి హానికరమని తెలిసినా మారడం లేదు.



నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

నెల్లూరు(అర్బన్): పొగాకు ఉత్పత్తులను ఏ రూపంలో తీసుకున్నా తీవ్ర అనర్థాలు ఖాయం. గుండె జబ్బులు, పలు రకాల కేన్సర్‌లు, పక్షవాతం లాంటి సమస్యలు పొగతాగేవారిలో ఎక్కువగా వస్తాయి. ఈ విషయాలను పరిశీలించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం మే 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని జరపాలని తీర్మానించింది. 1988 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది సదస్సులు, ర్యాలీలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నిస్తుంటారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో సుమారు 3 లక్షల మందికి పైగా పొగ తాగడం, లేదా పొగాకు ఉత్పత్తులను నమలడం చేస్తున్నారని ఒక అంచనా. వీరంతా వివిధ రకాల గుండె, ఊపిరితిత్తుల జబ్బులకు గురవుతున్నారు. సిగరెట్, బీడీ పొగను పీల్చే వారు సైతం జబ్బుల బారిన పడుతున్నారు. జిల్లాలో సుమారు 20 వేల మంది వరకు కేన్సర్ బాధితులున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 3,274 గుండె జబ్బుల కేసులు నమోదయ్యాయి. ఇక సీహెచ్‌సీలు, ప్రైవేట్ హాస్పిటళ్లు, జిల్లా, ఏరియా ఆస్పత్రులను పరిశీలిస్తే మరో ఏడువేల మంది వరకు గుండె జబ్బులతో బాధ పడుతున్నట్లు తెలుస్తోంది. అలాగే పీహెచ్‌సీల పరిధిలో 1,681 పక్షవాతం కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు, ఇతర ప్రభుత్వ వైద్యశాలల్లో పరిశీలిస్తే మరో మూడువేల మంది ఉంటారని అంచనా. అలాగే పీహెచ్‌సీల పరిధిలో 2,876 మంది సీఓపీడీతో (తీవ్ర ఊపిరితిత్తుల సమస్య) బాధపడుతున్నట్లు తేలింది. మిగిలిన ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో మరో 5 వేల కేసులు నమోదై ఉంటాయని భావిస్తున్నారు. అలాగే పీహెచ్‌సీల పరిధిలో 67,205 బీపీ కేసులు నమోదయ్యాయి. ఎక్కువ మంది పొగ తాగడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడమే అనారోగ్యానికి కారణంగా తెలిసింది.



పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్యశాఖ విడుదల చేసిన వాల్‌పోస్టర్

అధికమవుతున్న నోటి, గొంతు కేన్సర్‌లు

పొగ తాగడం వల్ల దంతాలకు ఉండే చిగుళ్ల కరిగిపోతాయి. దంతాలు రంగు మారిపోతున్నాయి. నాలుక, గొంతు, నోరు, ఈసోఫాగస్ (ఆహార వాహిక) ప్రాంతాల్లో కేన్సర్ రోగులు పెరిగిపోతున్నారు. అంతేకాకుండా పొగతాగే వారిలో మెదడుకు రక్తప్రసరణ సక్రమంగా అందకుండా పక్షవాతానికి గురవుతున్నారు. ఒక దఫా పక్షవాతం వస్తే ఇక జీవితాంతం ఇతరుల సహాయం మీద ఆధార పడాల్సిందే.

విస్తృతంగా అవగాహన

ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి పీహెచ్‌సీ పరిధిలో పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల జరిగే అనర్థాల గురించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అలాగే ర్యాలీలు చేపడుతున్నారు. కొంత కాలంగా చేస్తున్న ప్రచారం వల్ల పొగతాగే వారి సంఖ్య జిల్లాలో 38 శాతం నుంచి 25 శాతం వరకు తగ్గినట్లు తెలుస్తోంది.

దూరంగా ఉండాలి



పొగతాగడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల అనేక జబ్బులు వస్తాయి. గుండె జబ్బులు 30 శాతానికి పైబడి పొగతాగే వారిలోనే వస్తాయి. అలాగే ఊపిరితిత్తులు, కిడ్నీ జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది. రక్తనాళాలు గట్టి పడి రక్త ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. మెదడుకి రక్త ప్రసరణ అందక స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. పలు రకాల నోటి, జీర్ణాశయ లాంటి భాగాల్లో కేన్సర్లు రావచ్చు. అందువల్ల ధూమపానానికి, గుట్కా, పాన్‌పరాగ్ లాంటి పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. లేదంటే డబ్బులిచ్చి జబ్బులు కొనుక్కొన్న వారమవుతారు.

– డాక్టర్ శశిభరత్‌కుమార్‌రెడ్డి, పల్మనాలజిస్ట్, కిమ్స్

బలవుతున్న యువత

జిల్లాలో 18 నుంచి 24 ఏళ్లలోపు వయసున్న యువత పొగాకు ఉత్పత్తుల వినియోగానికి బానిసలవుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం చెడు సావాసాలు. ప్రతి సంవత్సరం కొత్తగా 8 శాతం మంది సిగరెట్‌కు అలవాటు పడుతున్నట్లు అంచనా. జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వినియోగం ప్రతి నెలా రూ.110 కోట్ల మేర ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీనిని బట్టి చూస్తే జిల్లాలో పొగాకు వినియోగం ఏమేరకు ఉందో తెలుస్తోంది. పొగతాగే వారితోపాటు పీల్చే వారు సైతం అనారోగ్యానికి గురవుతున్నారు. పొగ తాగే భర్తల కారణంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్త్రీలలో పునరుత్పత్తి శక్తి తగ్గడం, అబార్షన్లు జరగడం, పిండంలో లోపాలు వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

క్లుప్తంగా

గుట్టుచప్పుడు కాకుండా..
- అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం
- పోలీసుల దాడులు

నెల్లూరు(క్రైమ్): అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తోన్న వ్యభిచార కేంద్రంపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకురాలితోపాటు ముగ్గురు విటులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు ప్రాంతానికి చెందిన శ్రీలత తొమ్మిది నెలల క్రితం టెక్కేమిట్టలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుంది. నెల్లూరు నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లోని యువతులు, మహిళలను తీసుకొచ్చి వ్యభిచార కేంద్రం నిర్వహిస్తూ సొమ్ము చేసుకోసాగింది. ఈ వ్యవహారంపై దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్‌కు సమాచారం అందింది. గురువారం ఇన్‌స్పెక్టర్, ఎస్సై నరహరి తమ సిబ్బందితో కలిసి ఫ్లాట్‌పై దాడి చేశారు. నిర్వాహకురాలితోపాటు విటులు నెల్లూరు రవీంద్రనగర్‌కు చెందిన గిరితేజ, కొత్తూరుకు చెందిన పోలు, పొదలకూరుకు చెందిన బాలేష్‌ను అరెస్ట్ చేశారు. ఇద్దరు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకుని హోంకు తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 6.640 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.640 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 159
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 280
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 310
లేయర్ చికెన్	: 204

నిమ్మధరలు
పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ.62
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20

స్పా సెంటర్లలో తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): స్పా సెంటర్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇటీవల నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని ఓ సెలూన్ సెంటర్‌లో వ్యభిచారం నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి నిర్వాహకురాలితోపాటు విటుడిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా స్పా, సెలూన్, బ్యూటీపార్లర్లలో తనిఖీలు నిర్వహించి చీకటి కార్యకలాపాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. దీంతో నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి గురువారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కు, అపోలో సెంటర్ సమీపంలోని పలు స్పా సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్‌లు, సిబ్బంది వివరాలు, గదులు తదితరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చీకటి కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్రాస్ మసాజ్‌లు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై నిరంతర నిఘా ఉంటుందని ఈ సందర్భంగా డీఎస్పీ వెల్లడించారు. ఆయన వెంట సిబ్బంది మణి, సాగర్, గురవారెడ్డి తదితరులున్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

బాణసంచా విక్రయాలపై ఆరా

నెల్లూరు(క్రైమ్): బాణసంచా విక్రయాలు, అక్రమ నిల్వలపై పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. ఎన్నికల కమిషన్, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పక్కా ప్రణాళికతో ముందస్తు చర్యలు తీసుకున్నారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయడంతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీని పెంచారు. ఫ్లాగ్‌మార్చ్‌లతోపాటు కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు. ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లను బైండోవర్ చేస్తున్నారు. అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీచేశారు. ఎన్నికల నిబంధనల మేరకు పెట్రోల్, డీజిల్ లూజు విక్రయాలు జరపరాదని పెట్రోల్ బంకు నిర్వాహకులకు నోటీసులు జారీచేశారు. మద్యం విక్రయాలపై సైతం ఆంక్షలు విధించారు. విజయోత్సవ ర్యాలీలు నిషేధించారు. బాణసంచా కాల్చడంపై నిషేధం ఉంది. అందులో భాగంగా బాణసంచా అక్రమ నిల్వలు, విక్రయాలపై పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు దృష్టి సారించారు. దీపావళి సమయంలో బాణసంచా విక్రయించిన వ్యాపారులపై నిఘా పెట్టారు.

- తాజాగా గురువారం పొర్లుకట్టలోని బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాల్లో సంతపేట ఇన్‌స్పెక్టర్ ఎ.సుబ్బారాజు, జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి ఎస్.వేణుగోపాల్‌లు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. నిర్వాహకుల లైసెన్స్‌లను, స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో బాణసంచా విక్రయాలు చేయకూరాదని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



పొర్లుకట్టలో లైసెన్స్‌ను పరిశీలిస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్, ఏడీఎఫ్‌ఓలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'మూడు సంవత్సరాల వయసు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి. ఇందుకోసం జూన్ ఒకటో తేదీ నుంచి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలి' అని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఆదేశించారు. నెల్లూరులోని స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో గురువారం ఆమె సీడీపీఓలు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ శుక్రవారం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కేంద్రాలకు ఉదయం హాజరుకావాలన్నారు. పిల్లలకు మధ్యాహ్నం భోజనం పెట్టాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై, సంపూర్ణ పోషణ్ యాప్, సీఆర్ యాప్‌లను ప్రతి రోజూ అప్‌డేట్ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పోషకాహారం అందకపోతే వెంటనే పీడీ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



సీడీపీఓలతో మాట్లాడుతున్న హేనాసుజన్

వైద్యశాఖ ఉద్యోగికి మెమో?

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో శిథిలావస్థకు చేరుకున్న మలేరియా భవనంలో బుధవారం ఖరీదైన టేకును దొంగతనం చేసేందుకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నం చేసిన విషయం వెలుగు చూసింది. కొంత టేకు మాయమైనట్లు తెలిసింది. సమాచారం అందుకున్న అధికారులు టేకును తరలించకుండా అడ్డుకున్నారు. ఈ వ్యవహారంలో మలేరియా నివారణ విభాగానికి చెందిన ఓ ఉద్యోగి సహకారం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వైద్యశాఖాధికారులు అతడికి మెమో ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం. డీఎంహెచ్ఓ పెంచలయ్య డిపార్ట్‌మెంట్ పనిపై వేరే ప్రాంతానికి వెళ్లారు. ఆయన రాగానే మెమో ఇవ్వనున్నట్లు తెలిసింది. టేకును తరలించేందుకు ప్రయత్నించిన విషయమై గురువారం విజయవాడ నుంచి వైద్యారోగ్య శాఖ కమిషనరేట్ అధికారులు జిల్లా వైద్యశాఖ అధికారిని వివరణ కోరారు. దీంతో మలేరియా నివారణ విభాగం అధికారి పూర్తి వివరాలు పంపారు.

- ఇదిలా ఉండగా సహకారం అందించిన ఉద్యోగిపై తీవ్ర ఆరోపణలున్నాయి. గతంలో వెంకటాచలం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న సమయంలో విధులు సక్రమంగా నిర్వర్తించలేదని సస్పెన్షన్‌కు గురయ్యారు. అతని వల్ల సీహెచ్‌సీలో పనిచేస్తున్న ఓ నర్సు, ఓ డాక్టరు, మరో ఉద్యోగికి ప్రభుత్వం నుంచి బకాయిలు రాక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం సస్పెండ్ తొలగించినా ప్రవర్తన మార్చుకోలేదని ప్రచారం ఉంది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- కార్డన్ సెర్చ్‌లో 43 మోటార్‌బైక్‌ల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. నెల్లూరు నగరంలోని వేదాయపాళెం, విడవలూరు, సీతారామపురం, కలిగిరి, వింజమూరు, ఉదయగిరి, వరికుంటపాడు, కొండాపురం, వలేటివారిపాళెం పోలీసుస్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక, శివరు ప్రాంతాల్లో స్థానిక పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి గురువారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంట్లో సోదాలు చేశారు. సరైన పత్రాల్లేని 43 మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని ప్రజలు, రాజకీయ పార్టీల కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించాలన్నారు. ఆవేశాలకు లోనై గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కుని జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపునకు అందరూ సహకరించాలని, ఘర్షణలు, వివాదాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాహనదారుడి పత్రాలను పరిశీలిస్తున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నారాయణ